తక్కువ ధరకే ఆర్టీసీ అద్దె బస్సులు

రాజేంద్రనగర్: వివాహాది శుభకార్యాలు, విహార యాత్రలకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ రాజేంద్రనగర్ డిపోలో అతి తక్కువ ధరకే అద్దె బస్సులు అందిస్తుందని టీఎస్ ఆర్టీసీ రాజేంద్రనగర్ డిపో మేనేజర్ బద్రీనారాయణ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ... ఈ నెలలో అధికంగా పెళ్లిళ్లు, శుభకార్యాలు ఉన్నందున అద్దెకు మెట్రో, ఆర్టీసీ బస్సులు డిపాజిట్ లేకుండా ఇస్తున్నామన్నారు. ఈ నెల 5వ తేదీ నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు పెళ్లి కోసం బస్సులను బుక్ చేసుకుంటే వారికి 10 శాతం రాయితీ లభిస్తుందని ఆయన తెలిపారు. వివరాలకు జి.ప్రభాకర్ (ఫోన్: 99592 25137), జి.ఎస్.రెడ్డి (ఫోన్: 73828 04062)లను సంప్రదించాలన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన మాజీ సర్పంచ్

శంషాబాద్ రూరల్: మండలంలోని చౌదరిగూడ మాజీ సర్పంచ్ రాజ్‌కుమార్ తన అనుచరులతో కలిసి బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ సమక్షంలో ఆయన పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి ఎమ్మెల్యే వారిని పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మాజీ వార్డు సభ్యులు శ్రీనివాస్‌గౌడ్, ప్రేమ్‌కుమార్, నరేష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత



శంషాబాద్ రూరల్: ఆత్మహత్య చేసుకున్న యువకుడు కుటుంబానికి స్నేహితులు అండగా నిలిచారు. మండలంలోని పెద్దషాపూర్ గ్రామానికి చెందిన రమేష్ వారం కిందట ఆత్మహత్య చేసుకున్నాడు. అతనితో పాటు స్కూల్లో పదో తరగతి చదువుకున్న 2009 బ్యాచ్ స్నేహితులు రూ. లక్ష పోగు చేసి బుధవారం రమేష్ తల్లి దండ్రులకు అందజేశారు.

ఉద్యోగావకాశాలపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

మైలార్‌దేవ్‌పల్లి: ప్రతి విద్యార్థి నైపుణ్యంతో సొంతంగా సంస్థలను స్థాపించేలా ఎదగాలని ఉస్మానియా యూనివర్సిటీ మాజీ సీఈఓ డాక్టర్ హఫీజ్ బాషా విద్యార్థులకు సూచించారు. బుధవారం మహావీర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలోని ఇంజినీరింగ్ పరిశోధన విభాగంలో 'ఉద్యోగ అవకాశం సంస్థల స్థాపన' అనే అంశంపై ఎంబీఏ, బీటెక్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల సెక్రటరీ సంరెడ్డి సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ... విద్యార్థులు ఏకాగ్రతతో చదివి కళాశాల నుంచి ఉద్యోగం సంపాదించుకొని తల్లిదండ్రుల ఆశయసాధనకు కృషి చేయాలని విద్యార్థులు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉషాశ్రీ, కార్యదర్శి వి.వి.ప్రతిభ, వైస్ ప్రెసిడెంట్ శ్రీజనాయర్ తదితరులు పాల్గొన్నారు.

వరుణుడి కరుణ కోసం రైతుల పూజలు



మల్కారం ఈసీవాగు కత్వ వద్ద వరుణ దేవుడికి పూజలు చేస్తున్న రైతులు

శంషాబాద్ రూరల్: వాన దేవుడి కరుణ కోసం రైతులు పూజలు చేశారు. కరుణించాలని కోరుతూ బండపై పాశం పోసి తిన్నారు. మల్కారం గ్రామానికి చెందిన రైతులు బుధవారం గ్రామ శివారులో ఈసీ వాగుపై ఉన్న కత్వ వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వండి తెచ్చిన పాశాన్ని బండపై పోసి నాకారు. రెండు నెలలు గడుస్తున్నా సరిగా వానలు కురవడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వాగుల్లో ఇప్పటి వరకు చుక్క నీరు కూడా పారక.. భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయని పేర్కొన్నారు.

పెండింగ్ డీఏలు మంజూరు చేయాలి: ఎస్టీయూ

అత్తాపూర్: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు మంజూరు చేయాల్సిన పెండింగ్ డీఏలను మంజూరు చేయాలని ఎస్టీయూటీఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రవీణ్‌కుమార్, రంగారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం రాజేంద్రనగర్ మండలంలోని గణేష్‌నగర్, పద్మశాలీపురం, మైలర్ దేవ్‌పల్లి, అత్తాపూర్, బుద్వేల్ పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... యాభై శాతం ఫిట్‌మెంట్‌తో మెరుగైన పీఆర్సీని వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో స్కావెంజర్లను, ఉచిత విద్యుత్‌ను మంజూరు చేయడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి సుధాకర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాస్ రావు, వీరమణి, ఏఐఎస్‌టీఎఫ్ జాతీయ నాయకులు పరమేష్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాలకృష్ణ, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా రాములోరి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవంలో పాల్గొన్న భక్తులు

రాజేంద్రనగర్: హైదర్‌గూడ చైతన్య విలాస్ కాలనీ రామాలయంలో బుధవారం విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 9వ తేదీన సీతారాముల విగ్రహ ప్రతిష్ఠాపన కోసం ఆలయంలో ప్రత్యేకంగా హోమాలు, పూజ కార్యక్రమాలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ ఉదయం నుంచి రాత్రి వరకు ఈ పూజలు కొనసాగాయి. విగ్రహ ప్రతిష్ఠాపన నేపథ్యంలో దేవాలయాన్ని వివిధ రంగులతో అందంగా తీర్చిదిద్దారు.

యథేచ్ఛగా మట్టి తవ్వకాలు

సర్కారు భూములను తవ్వేస్తున్న అక్రమార్కులు

- రాత్రి వేళల్లో అక్రమంగా తరలింపు
- చోద్యం చూస్తున్న అధికారులు



శంకరాపురంలో ప్రభుత్వ భూమిలో మట్టి తవ్వకాలతో ఏర్పడిన గుంతలు

శంషాబాద్ రూరల్: ప్రభుత్వ భూములు అక్రమార్కులకు కాసులు కురిపిస్తున్నాయి. సర్కారు భూముల్లో యథేచ్ఛగా మట్టి తరలించి జేబులు నింపుకొంటున్నారు. అడ్డుకోవాల్సిన అధికార యంత్రాంగం తమకేమీ పట్టనట్లు మిన్నకుండిపోతోంది.

- మండలంలోని శంకరాపురం, పెద్దషాపూర్, సయ్యద్‌గూడ, మదన్‌పల్లి, పాల్మాకులలోని ప్రభుత్వ భూముల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. బహుళ అంతస్తులు, ఇతర నిర్మాణాల కోసం కావాల్సిన మొరం ఇక్కడి నుంచి తరలిస్తున్నా ఎవరికీ పట్టింపు లేకుండా పోయింది.

చీకటి పడితే చాలు...

చీకటి పడిందటే చాలు అక్రమార్కులు జేసీబీలు, లారీలతో ప్రభుత్వ భూముల్లో వాలిపోతున్నారు. శంకరాపురం సర్వే నంబర్లు 21, 22లలో సుమారు పది ఎకరాల్లో అక్రమ తవ్వకాలు జరిపారు. ఈ భూముల్లో పంచాయతీకి చెత్త డంపింగ్ యార్డుకు స్థలం కేటాయించారు. యార్డు మినహా మిగిలిన భూమిలో భారీగా మట్టిని తవ్వి తీసుకెళ్లారు.

- సయ్యద్‌గూడ, పాల్మాకులలో సైతం సెలవు రోజుల్లో అక్రమార్కులకు కాసులు కురుస్తున్నాయి. గ్రామాల్లో నిఘా వ్యవస్థ లేకపోవడంతో పాటు స్థానిక నాయకులు అక్రమార్కులకు వత్తాసు పలుకుతుండటంతో తవ్వకాలు అడ్డులేకుండా పోతోంది. ఒక్కో లారీ మట్టిని రూ.3వేలకు పైగా అమ్ముకుంటున్నారు.

వాగులనూ వదలని వైనం...

అక్రమార్కులు చెరవులు, వాగులను వదలడం లేదు. పట్టా భూముల పక్కన ఉన్న చెరువు, వాగు బఫర్‌జోన్లలో యథేచ్ఛగా మట్టిని తోడుతున్నారు. ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల ఉదాసీన వైఖరితో అక్రమార్కులకు ఎదురులేకుండా పోతోంది.

- ఇటీవల కేబీ దొడ్డి శివారులో ఈసీవాగులో సుమారు రూ. కోటి విలువ చేసే నల్ల మట్టి, ఇసుకను అక్రమంగా తరలించారు. ఇందుకు ఇరిగేషన్ అధికారులు అండదండలు పుష్కలంగా ఉన్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. పెద్ద ఎత్తున అక్రమ తవ్వకాలు జరిగిన విషయాన్ని రైతులు ఇరిగేషన్ మంత్రి దృష్టికి సైతం తీసుకెళ్లారు. ఇందుకు బాధ్యులైన వారిపై కేసు నమోదు చేసి తర్వాత ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని రైతులు మండిపడుతున్నారు.
- సుల్తాన్‌పల్లి శివారులోని ఎంటేరువాగులో కూడా మట్టిని తవ్వి పట్టా భూముల్లోని గుంతలను పూడ్చి చదును చేశారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



రోడ్లపై పనులను పరిశీలిస్తున్న మేయర్ లతాప్రేమ్‌గౌడ్, కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మద్దెల లతాప్రేమ్‌గౌడ్ సూచించారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా బుధవారం 9, 17, 21వ డివిజన్లలో కార్యక్రమాలను నిర్వహించారు. వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా గోతులమయమైన రోడ్లపై మట్టిని, వెట్‌మిక్స్‌లను పోశారు. ఈ పనులను కమిషనర్ శరత్‌చంద్రతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని కార్పొరేషన్ పరిధిలో ముమ్మరంగా నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి రోజు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. అలాగే ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించి భాగస్వాములను చేస్తున్నామన్నారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీఈఈ యాదయ్య, ఏఈఈ రాజ్‌కుమార్, వార్డు ఆఫీసర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు, శానిటరీ జవాన్లు, స్వీపర్లు పాల్గొన్నారు.

అరుణాచలం గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సులు

శంషాబాద్: తమిళనాడులోని అరుణాచలం గిరి ప్రదర్శనకు హైదరాబాద్ డిపో (దిల్‌సుఖ్‌నగర్) నుంచి రాఖీపౌర్ణమిన ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 17 తేదీ రాత్రి 7.15 గంటలకు దిల్‌సుఖ్‌నగర్ నుంచి బయలుదేరి కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ మీదుగా అరుణాచలం చేరుకుంటుందన్నారు. తిరిగి 19 తేదీ మధ్యాహ్నం అక్కడి నుంచి హైదరాబాద్‌కు బస్సులు బయలుదేరుతాయన్నారు. ప్రయాణికులకు ఒక్కొక్కరి రూ. 3600 చార్జీగా ఉందన్నారు. ఆన్‌లైన్ ద్వారా లేదా లేదా ఏటీబీ ఏజెంట్ల నుంచి టికెట్లను పొందవచ్చన్నారు. వివరాలకు ఫోన్: 99592 26249, 96663 50995లలో సంప్రదించవచ్చన్నారు.

యూట్యూబ్ చానల్ రిపోర్టర్‌పై రౌడీషీటర్ కత్తితో దాడి

మైలార్‌దేవ్‌పల్లి: పాత కక్షలతో యూట్యూబ్ రిపోర్టర్‌పై దాడి చేసిన ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు ఇన్‌స్పెక్టర్ పి.నరేందర్ తెలిపిన వివరాల ప్రకారం... ఫలక్‌నుమాకు ప్రాంతానికి చెందిన ముబిన్(50) యూట్యూబ్ చానల్ రిపోర్టర్‌గా పని చేస్తున్నాడు. బాలానగర్ ప్రాంతానికి సోహైల్ అనే రౌడీ షీటర్‌తో పరిచయం ఉన్నది. రౌడీషీటర్‌పై ఓ కేసు విషయంలో యూట్యూబ్‌లో ప్రసారం చేశాడు. ఎందుకు చానల్‌లో ప్రసారం చేశావని రిపోర్టర్‌ను పలు మార్లు బెదిరించాడు. యూట్యూబ్‌లో తన గురించి వచ్చిన కథనం లింకును తీసివేయాలని అన్నాడు. మంగళవారం అర్ధరాత్రి రిపోర్టర్ ముబిన్‌పై సోహైల్ తన అనుచరులతో కలిసి కత్తితో దాడి చేశారు. తీవ్ర గాయాలు కావడంతో స్నేహితులు చికిత్స నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. సోహైల్ తన అనుచరులతో కలిసి ముబీన్‌ను ఎప్పటికైనా నిన్ను చంపుతానని బెదిరిస్తూ వెళ్లిపోయారని చెప్పారు. ముబిన్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్సీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చండి: బీజేపీ



ఆర్ఐకి వినతిపత్రం అందించిన బీజేపీ నాయకులు

మణికొండ: గత ఎన్నికల కన్నా ముందు కాంగ్రెస్ పార్టీ ఎస్సీలకు అనేక హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చి 8 నెలలు దాటినా వారి విషయాన్ని పట్టించుకోవటం లేదని, ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టి.అంజన్‌కుమార్‌గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం గండిపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎస్సీ సెల్ నార్సింగి, మణికొండ, బండ్లగూడ మున్సిపాలిటీల అధ్యక్షులు అనిల్, వినోద్, గోపాల ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎన్నికల కంటే ముందు ఓట్లను దండుకునేందుకు చేవెళ్ల కేంద్రంగా ఎస్సీలకు అనేక హామీలను ఇచ్చారన్నారు. వారి హామీలను పట్టించుకోకుండా ఇపుడు కాంగ్రెస్ ప్రభుత్వం వారిని మోసం చేస్తుందన్నారు. ఇకనైనా వారికి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని లేదంటే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం వారు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు డి.లక్ష్మీనారాయణ, రాష్ట్ర ఎస్సీమోర్చా కోశాధికారి సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి గణేష్, బీజేపీ మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు సి.బీరప్ప, బండ్లగూడ కార్పొరేషన్ అధ్యక్షుడు మహేష్‌యాదవ్, ఓబీసీ మోర్చా నియోజకవర్గ కన్వీనర్ బి.శివకుమార్, నాయకులు ఎం. నాగేశ్‌యాదవ్, మల్లారెడ్డి, అనితాదేవి, నరేష్, నరసయ్యాచారి, శివరాంరెడ్డి, కిరణ్, సంగీత తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోండి





నేతాజీ కాలనీలో మణికొండ మున్సిపల్ చైర్మన్, మంచిరేవులలో నార్సింగి మున్సిపల్ చైర్ పర్సన్..

మణికొండ: మున్సిపాలిటీల పరిధిలోని రోడ్లపై ఎక్కడా గోతులు లేకుండా, నీరు నిలవకుండా చూడాల్సిన బాధ్యత ఇంజినీరింగ్ అధికారులపై ఉంటుందని మణికొండ మున్సిపల్ చైర్మన్ కె.నరేందర్ ముదిరాజ్, నార్సింగి మున్సిపల్ చైర్ పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్ అన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా మూడవ రోజు మణికొండలో 13వ వార్డు నేతాజీనగర్ కాలనీ ప్రవేశంలో నిలుస్తున్న వర్షపునీరు నిలువకుండా చర్యలు చేపట్టారు. 17వ వార్డు సెక్రటేరియట్ కాలనీలో ప్రజలకు మొక్కలను పంపిణీ చేయటం, 4వ వార్డు హుడాకాలనీ పార్కులో పిచ్చి మొక్కలను తొలగింపు, 8వ వార్డు ఎంజీ పార్కులో ఇంకుడు గుంతలను శుభ్రం చేయించారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని మంచిరేవుల, కోకాపేట, గండిపేట, నార్సింగిలలో రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చివేసి, నాలాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వర్షాకాలంలో నిలువ ఉండే నీటిలో దోమల వ్యాప్తి జరుగుతుందని, వాటిని నివారించేందుకు నీరు నిలువ ఉండకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమాల్లో మణికొండ మున్సిపల్ కమిషనర్ డి.ప్రదీప్‌కుమార్, నార్సింగి మున్సిపల్ కమిషనర్ టి.ప్రవీణ్‌కుమార్ రెడ్డి, మణికొండ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి, మేనేజర్‌లు శ్రీధర్, యోగేష్, డీఈ నరసింహరాజు, ఏఈలు శ్రీనివాస్, సంజయ్, కౌన్సిలర్‌లు పాల్గొన్నారు.

పచ్చదనంపై చిన్నారులకు అవగాహన అవసరం



మొక్కను నాటుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

మైలార్‌దేవ్‌పల్లి: ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల ఆవరణల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. బుధవారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని నర్సాబాయి కుంటలో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా స్థానిక నాయకులు, విద్యార్థులతో కలిసి మొక్కలను నాటారు. అనంతరం ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ మాట్లాడుతూ... విద్యార్థులకు పచ్చదనం ఆవశ్యకతపై అవగాహన కల్పించి చిన్నప్పటి నుంచి మొక్కలను నాటే కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలని కోరారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే మొక్కలను నాటి పెంచాలని స్థానిక ప్రజలకు తెలిపారు. కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారిణి స్వరాజ్యం, స్థానిక నాయకులు లక్ష్మారెడ్డి, అనిల్, పవన్, శ్రీనివాస్ రెడ్డి, పగిడిమర్రి సూర్యనారాయణ, విడెం రమేష్, కోట శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

- ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్



మొక్కకు నీరు పోస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

అత్తాపూర్: భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటుతూ వాటిని పెంచి పెద్ద చేసే బాధ్యత తీసుకోవాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా పెద్దతాళ్లకుంట పార్కులో కార్పొరేటర్ సంగీత, రాజేంద్రనగర్ మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ కె.రవికుమార్, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. తెలంగాణ ఉద్యమంలో అమరులైన వీరులను స్మరించుకుంటూ తెలంగాణ గీతాన్ని ఆలపించి అనంతరం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... శబ్ధ, నీరు, వాయు కాలుష్యాలతో ప్రపంచ వాతావరణమంతా తిరోగమనంలో పయనిస్తూ మానవ మనుగడనే ప్రశ్నిస్తోందన్నారు. పెద్ద తాళ్లకుంట పార్కును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి ప్రజలకు అంకితం చేస్తామన్నారు. కాలుష్య రహిత జీవనం కోసం వృక్ష సంపదను పెంపొందిస్తూ ప్లాస్టిక్ వస్తువులనే వాడకాన్ని పూర్తిగా నిషేధించుకోవాలని విద్యార్థుల చేత ప్రమాణం చేయించారు. కృష్ణ సాగర్, ఆర్‌డబ్ల్యూఎఎస్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు శ్రీకాంత్, వివిధ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం



చేనేత జెండా ఆవిష్కరించిన నేతలు

మైలార్‌దేవ్‌పల్లి: పద్మశాలీయులు చేనేత వృత్తి పట్ల గౌరవం పెంచి వారు నేచిన వస్త్రాలను ధరించాలని రంగారెడ్డి జిల్లా పద్మశాలీ సంఘం మాజీ కార్యదర్శి ఏర్వ సత్యనారాయణ పేర్కొన్నారు. బుధవారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని భావన ఋషి నగర్ శ్రీ మార్కండేయ పద్మశాలీ ట్రస్టు భవనంలో జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. పద్మశాలీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ...దేశంలో చేనేత వృత్తి చాలా వైవిధ్యమైనదని, అలాంటి వారసత్వ సంపదను కాపాడుకోవాలసిన బాధ్యత ప్రతి పద్మశాలీపై ఉందన్నారు. చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి ప్రతి ఒక్కరూ ధరించేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో దొంతరాజు, కొంపల్లి జగదీష్, సామల యాదయ్య, కొంకోట్టి ఆంజనేయులు, చిరంజీవి, వెంకటేష్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



శ్రీకృష్ణయాదవ్‌కు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: విద్యార్థులు క్రమ శిక్షణ, పట్టుదలతో చదువుకోవడంతో పాటు సమాజానికి ఉపయోగపడేలా మెలగాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా హైదర్షాకోట్‌లోని ఎస్ఎంపీ ఇంటర్నేషనల్ పాఠశాలలో శానిటేషన్, సీజనల్ వ్యాధులు, ప్లాస్టిక్ ఉపయోగం, నష్టాలు, హరితహారం, వీధి కుక్కలపై చర్యలు అనే అంశాలపై వ్యాసరచన, వకృత్వం పోటీలను విద్యార్థులకు నిర్వహించారు. ఈ సందర్భంగా గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఎస్ఎంపీ పాఠశాల చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, కరస్పాండెంట్ పి.చంద్రకళ, అడ్మిన్ డైరెక్టర్ శ్వేతా రెడ్డి, సీఈవో భవ్యారెడ్డి, దివ్యారెడ్డి, జేసుదాసు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్, బిల్ కలెక్టర్ నరేందర్‌రెడ్డి, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దేవాలయ భూమిని కాపాడాలని వినతి

రాజేంద్రనగర్: కబ్జాకు గురవుతున్న వీరభద్ర స్వామి దేవాలయ స్థలాన్ని కాపాడాలని దేవాలయ కమిటీ ప్రతినిధులు, బీజేపీ నాయకులు కోరారు. బుధవారం వీరభద్రస్వామి దేవాలయ కమిటీ అధ్యక్షుడు తలారి శ్రీకాంత్ ఆధ్వర్యంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్ నాయకత్వంలో రాజేంద్రనగర్ తహసీల్దార్ రాములుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ... దశాబ్దాల క్రితం వీరభద్రుడి ఆలయాన్ని నిర్మించారన్నారు. ఈ దేవాలయానికి దాదాపు 38 ఎకరాల భూమి సర్వే నంబర్ 36లో ఉందన్నారు. ప్రస్తుతం ఈ దేవాలయం స్థలం మొత్తం కబ్జాకు గురవుతున్నదనిన్నారు. కొంత మంది ప్రైవేటు బిల్డర్లు నోటరీలు తయారు చేసి అమ్ముకుంటున్నారన్నారు. దేవాలయ భూమిని కబ్జా చేస్తున్న ప్రైవేటు వ్యక్తులపై చర్యలు తీసుకొని దేవాలయ భూములను ప్రభుత్వం కాపాడాలన్నారు. దీనిపై సానుకూలంగా స్పందించి తహసీల్దార్ రాములు ఆర్ఐ వినయ్ లతను పరిశీలించాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. సులేమాన్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు యు.విక్రమ్ చారి, ఆనంద్, ప్రకాశ్, సాయి కుమార్, ఆనంద్ సింగ్, విక్కీ, రాము, రాజ్ కుమార్, విశాల్ కపూర్ తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక, ఆతిథ్య రంగాలలో మంచి అవకాశాలు

- రాష్ట్ర పర్యాటక శాఖ సంచాలకులు, నిథమ్ డైరెక్టర్ ఇలాత్రిపాఠి
- నిథమ్‌లో 'టూరిజం టౌన్‌హాల్' నిర్వహణ

రాయదుర్గం: పర్యాటక, ఆతిథ్య రంగాలలో మంచి అవకాశాలు ఉంటాయని రాష్ట్ర పర్యాటక శాఖ సంచాలకులు, నిథమ్ డైరెక్టర్ ఇలాత్రిపాఠి స్పష్టం చేశారు. బుధవారం 'నిథమ్'లో 'పర్యాటక టౌన్‌హాల్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ నైపుణ్యం ఉన్న వారికి మంచి అవకాశాలు ఉంటాయన్నారు. రాడిసన్ గ్రూప్ సౌత్ ఆసియా జనరల్ మేనేజర్ సందీప్‌జోషి మాట్లాడుతూ పర్యాటక, ఆతిథ్య పరిశ్రమ కఠినమైందని, కానీ ఎదుగుదలకు కూడా అవకాశం ఉంటుందన్నారు. తాను జీఎం కావడానికి 15 ఏళ్లు పట్టిందని, నేడు ఏడేళ్లలోనే ఆ స్థాయికి చేరుకోవచ్చన్నారు. నేర్చుకోవడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. నోవాటెల్ కన్వెన్షన్ సెంటర్ జనరల్ మేనేజర్ రూబిన్ చెరియన్ మాట్లాడుతూ ఈ రంగాలు మహిళలకు ప్రత్యేకమైన వన్నారు. తాజ్‌కృష్ణ జనరల్ మేనేజర్ పంకజ్ సంపత్ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే శ్రమించే తత్వం, ప్రతిభావంతులకు మంచి అవకాశాలు వస్తాయన్నారు. అనంతరం ప్రశ్నోత్తరాల సమయం నిర్వహించారు. నిథమ్ ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం కే గణేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఫ్యాకల్టీ విజయలక్ష్మీ, మిషెల్లీ జే ఫ్రాన్సిస్, ఇతర ఫ్యాకల్టీ ప్రతినిధులు, అధికారులు, ఎంబీఏ, బీబీఏ, బీఎస్సీ విద్యార్థులు పాల్గొన్నారు.